# సాక్షి అనకాపల్లి

బుధవారం । 29 । మార్చి । 2023






## సింహగిరి అభివృద్ధి

సింహాచలంపై రూ.54.04 కోట్లతో 'ప్రసాద్' పనులకు వారం రోజుల్లో టెండర్లు పిలుస్తామని మంత్రి రోజా చెప్పారు. 8లో



## క్షమించండి.. వెళ్లిపోతున్నాం

ఉక్కు ఉద్యోగి దంపతుల సెల్ఫీ వీడియో కలకలం సృష్టించింది. ఏలేరు కాల్వ వద్ద వారి సామగ్రి లభించడంతో గాలిస్తున్నారు. 8లో

## స్వల్ప వర్షసూచన

అనకాపల్లిటౌన్ : రాగల అయిదురోజుల్లో నాలుగు రోజులు స్వల్ప వర్షసూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 32.8 నుంచి 33 డిగ్రీలు. తేమ శాతం 78 నుంచి 79. గాలి గంటకు 8 నుంచి 9 కి.మీ.వేగంతో వీస్తుందన్నారు.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ (బుధ) | సహర్ (గురు) |
|---|---|---|
| అనకాపల్లి | 6-13 | 4-40 |
| నర్సీపట్నం | 6-17 | 4-39 |

## న్యూస్‌రీల్

### తక్షణం రోడ్ల మరమ్మతులకు ఆదేశం



రోడ్ల మరమ్మతులపై ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. విశాఖపట్నం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చోడవరం నియోజకవర్గ పరిధిలో బీఎస్ రోడ్డుతో పాటు పలు రహదారులు చాలా ఘోరంగా దెబ్బతిన్నాయని, వాటిని వెంటనే బాగు చేయాలని కోరారు. బీఎస్ రోడ్డు ఆధునికీకరణకు నిధులు మంజూరైనా ఎందుకు పనులు చేపట్టడం లేదని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. వెంటనే ఆ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. దీనికి వారు స్పందిస్తూ రెండ్రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 'పరిశ్రమల స్థాపనకు సహకారం అందిస్తాం'



మాట్లాడుతున్న రామారావు

అల్లిపురం (విశాఖ): పది వేల మందికి ఉపాధి లక్ష్యంగా ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు బీవీ రామారావు వెల్లడించారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంస్థ ఏర్పాటుకు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 110 ఎకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తాము ఏర్పాటు చేసే కార్పొరేషన్ ద్వారా పరిశ్రమలకు ముడి సరకు సరఫరా చేస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారు 98666 49369కు కాల్ చేస్తే.. సహకారం అందిస్తామని తెలిపారు.


నారాయణ కాలేజీ విద్యార్థిని బలవన్మరణం 8లో


# 'మహా' నమామి



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న విదేశీ ప్రతినిధి



సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్

- హాజరైన జీ20 దేశాల ప్రతినిధులు
- విమానాశ్రయంలో అతిథులకు సంప్రదాయ స్వాగతం
- తొలి రోజున మూడు అంశాలపై విస్తృతంగా చర్చలు
- విదేశీ ప్రతినిధులతో సీఎం వైఎస్ జగన్ సమావేశం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి, విశాఖపట్నం : జీ20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్(ఐడబ్ల్యూజీ) రెండో దశ సమావేశాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జనవరిలో పూణేలో నిర్వహించిన ఐడబ్ల్యూజీ సదస్సుకు కొనసాగింపుగా రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఈ సదస్సు నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిరోజు సాయంత్రం సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'అద్భుత నగరం విశాఖలో మీరు గడిపిన సమయం ప్రతి ఒక్క అతిథికి మధురానుభూతి మిగులుస్తుందని' సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. అనంతరం జీ–20 దేశాల ప్రతినిధులతో పాటు వివిధ రంగాల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి గాలా డిన్నర్ పేరుతో ప్రత్యేక ఆతిథ్య విందుని ప్రారంభించారు. తరువాత 14 దేశాల ముఖ్యలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తొలిరోజు సదస్సుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆర్థిక నగరాల సుస్థిరత, స్థితిస్థాపకత అంశంపై తొలి సెషన్‌లో వివిధ దేశాల ప్రతినిధులు చర్చించారు. అనంతరం.. భవిష్యత్తులో ఆర్థిక నగరాలుగా అభివృద్ధి చెందనున్న దేశాల్లో రాబోతున్న మార్పులపై రెండో సెషన్‌లో చర్చించారు. ప్రపంచ బ్యాంకుకు సంబంధించి క్వాలిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్(క్యూఐఐ) సూచీలపై చివరి సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి అనే అంశంపై వివిధ దేశాల ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొని తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ఈ సదస్సులో జీ–20 సభ్యదేశాల ప్రతినిధులు, 8 అతిథి దేశాలకు చెందిన ప్రతినిధులు, 10 అంతర్జాతీయ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.



సాంస్కృతిక కార్యక్రమాల్ని మొబైల్‌లో బంధిస్తున్న మంత్రి రోజా, విదేశీ ప్రతినిధులు



గాలా డిన్నర్‌లో పాల్గొన్న విదేశీ ప్రతినిధులు

### ఆతిథ్యం.. అదిరింది





విమానాశ్రయంలో విదేశీ అతిథులకు సంప్రదాయ స్వాగతం

జీ 20 సదస్సులో పాల్గొనేందుకు ఇందులో సభ్యులుగా ఉన్న 15 దేశాలకు చెందిన ప్రతినిధులు విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో విదేశీ ప్రతినిధులకు తెలుగు సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలికారు. అతిథులకు కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికి.. పూలమాలలు, శాలువా వేసిన అనంతరం.. కుంకుమ బొట్టు పెట్టి.. నగరానికి ఆహ్వానించారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్లకు విదేశీ ప్రతినిధులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆతిథ్యం అదిరిపోయిందంటూ.. సదస్సుల్లో పలు దేశాల ప్రతినిధులు తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. తొలిరోజు సదస్సు ముగిసిన అనంతరం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతిథులకు గాలా డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా వంటకాలతో పాటు.. భారత్‌లో ప్రసిద్ధి చెందిన రుచుల్ని అందించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆతిథ్యానికి విదేశీ అతిథులు ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా వాహ్‌వా అనిపించాయి. కొమ్ము నృత్యం నుంచి కూచిపూడి వరకు, భరతనాట్యం, కథాకళితో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన నృత్యాలు ప్రదర్శించారు. అదేవిధంగా.. పలు పౌరాణిక పాత్రలతో ఏక పాత్రాభినయాలు మంత్రముగ్ధుల్ని చేశాయి.







# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం





ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మేయర్ హరి వెంకట కుమారి, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

గోపాలపట్నం: విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీ–20 సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సాయంత్రం 7.05 నిమిషాలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయన ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాడిషన్ బ్లూ హోటల్‌కు బయలుదేరారు. అక్కడ విదేశీ ప్రతినిధులతో సమావేశమై.. తిరిగి రాడిషన్ బ్లూ నుంచి విశాఖ విమానాశ్రయానికి రాత్రి 9.10 గంటలకు చేరుకున్నారు. 9.21 గంటలకు ప్రత్యేక విమానంతో గన్నవరానికి బయలు దేరారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఆర్.కె.రోజా, మేరుగ నాగార్జున, విప్ కరణం ధర్మశ్రీ, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, గొల్ల బాబూరావు, కె.భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ, వెంకటరమణ మూర్తి రాజు, ప్రత్యేక కార్యదర్శులు శ్రీలక్ష్మి, ఎస్.రజిత్ భార్గవ్, కలెక్టర్ మల్లికార్జున, సీపీ సీహెచ్ శ్రీకాంత్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

## జీ-20 సదస్సు పైలాన్ జాతికి అంకితం



పైలాన్‌ను జాతికి అంకితం చేస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, అమర్‌నాథ్ తదితరులు

బీచ్‌రోడ్డు: జీ–20 సదస్సు చిరకాలం గుర్తుండిపోయేలా వీఎంఆర్డీఏ పార్కులో ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంగళవారం రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ జాతికి అంకితం చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీయులు మెచ్చిన గిరిజన ఉత్పత్తులు





స్టాల్స్‌లో జీసీసీ ఉత్పత్తులు, లేపాక్షి, చేనేత, హస్తకళా రూపాలు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో కళాకారుల హస్తకళా ప్రతిభకు జీ20 సభ్యదేశాలకు చెందిన ప్రతినిధులు ముగ్ధులయ్యారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభమైన జీ–20 సభ్యదేశాల సదస్సులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పలు స్టాళ్లు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) సేకరించి బ్రాండింగ్ కల్పిస్తూ మార్కెటింగ్ చేస్తున్న గిరిజన ఉత్పత్తుల స్టాల్‌తో పాటు రాష్ట్ర వైభవాన్ని ప్రస్ఫుటించే లేపాక్షి, చేనేత, హస్తకళా రూపాల స్టాల్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి. విదేశీయులకు వైభవాన్ని, గిరిజనుల కష్టాన్ని చూపించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీసీసీ చైర్‌పర్సన్ శోభస్వాతిరాణి గిరిజన ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# పర్యాటకానికి రాచమార్గం



బొజ్జన్నకొండకు మహర్దశ



రోడ్డు నిర్మాణానికి సిద్ధం చేసిన కంకర, పిక్క

- బొజ్జన్నకొండకు రూ.1.5 కోట్లతో రహదారి నిర్మాణం
- శంకరం నుంచి వెయ్యి మీటర్ల బీటీ రోడ్డు
- మూడు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు

తుమ్మపాల: ప్రాచీన సంపద బొజ్జన్నకొండ. బౌద్ధారామంగా ఎంతో గుర్తింపు పొందింది. కానీ ఒక్క కనుమ రోజున మాత్రమే ప్రజలకు గుర్తుకొస్తుంది. ఆరోజున అక్కడ జరిగే తీర్థానికి ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి వేలాదిగా జనం వస్తారు. మిగతా రోజుల్లో వెలవెలబోతుంది. పర్యాటక ప్రాంతంగా ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఎక్కడైనా ప్రగతి పరవళ్లు తొక్కాలంటే ముందు మంచి రహదారి సౌకర్యం ఉండాలి. అందుకే రూ.1.5 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి పాలకులు, అధికారులు శ్రీకారం చుట్టారు.

### నెరవేరనున్న చిరకాల వాంఛ

అనకాపల్లి మండలం శంకరం రెవెన్యూ పరిధిలో బొజ్జన్నకొండ ఉన్నప్పటికీ శంకరం–తుమ్మపాల గ్రామాల మధ్యలో ఉండటంతో రెండు గ్రామాల నుంచి ప్రజలు ఇక్కడకు రాకపోకలు సాగిస్తున్నారు. అనకాపల్లి–చోడవరం రహదారిలో తుమ్మపాల నుంచి ఏలేరు కాలువ మీదుగా రెండేళ్ల క్రితం రెండు కిలో మీటర్ల పొడవున బొజ్జన్నకొండకు రహదారి నిర్మించారు. అయితే అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి మీదుగా శంకరం వద్ద ఏలేరు కాలువ గుండానే అధికంగా సందర్శకులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో రహదారి శిథిలావస్థకు చేరడంతో అనేక ప్రజాసంఘాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశాయి. అయినా ఫలితం లేకపోయింది. ఇన్నాళ్లకు ఆ సంకల్పం నెరవేరబోతోంది. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రత్యేక చొరవతో బీటీ రోడ్డు నిర్మాణానికి బీజం పడుతోంది.

### మూడు నెలల్లో పూర్తి చేసేలా..

రానున్న మూడు నెలల్లో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రోడ్డు పనులు మొదలు పెట్టేందుకు మంగళవారం నుంచి కంకర, పిక్క వంటి వనరులను రోడ్డుపై నిల్వ చేస్తున్నారు. శంకరం వద్ద ఏలేరు కాలువ జంక్షన్ నుంచి బొజ్జన్నకొండ వరకు తుమ్మపాల రోడ్డును కలుపుతూ వెయ్యి 50 మీటర్ల పొడవు గల రోడ్డును నిర్మించనున్నారు. అనకాపల్లి–ఆనందపురం రహదారి ఆనుకుని ఏలేరు కాలువ గుండా బీటీ రోడ్డు నిర్మించి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఇందుకు రూ.1.5 కోట్లు ఖర్చవుతుందని లెక్కలు వేశారు. ఎంపీ సత్యవతి ఎంపీ నిధుల నుంచి రూ.40 లక్షలు విడుదల చేశారు. కలెక్టర్ దృష్టి సారించి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద పలు పరిశ్రమలు మిగతా మొత్తాన్ని సమకూర్చేలా చర్యలు తీసుకున్నారు. మూడు నెలల్లోనే ఈ రహదారిని అందుబాటులోకి తెచ్చేలా పనులు శరవేగంగా జరిపిస్తామని పంచాయతీరాజ్ ఈఈ ఎస్.వి.నాయుడు చెప్పారు.

### గ్రీనరీ, వాకింగ్ ట్రాక్‌తో రోడ్డు నిర్మాణం



జాతీయ రహదారి నుంచి బొజ్జన్నకొండకు గ్రీనరీ, వాకింగ్‌ట్రాక్‌తో రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం. ఇందుకు ఎంపీ నిధుల నుంచి రూ.40 లక్షలు విడుదల చేశాను. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ సహకారంతో బొజ్జన్నకొండ అభివృద్ధిలో భాగంగా రోడ్డు పనులు వేగంగా జరిపేలా చర్యలు చేపడుతున్నారు. పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చెందేందుకు నా వంతు కృషి చేస్తాను.

–డాక్టర్ బి.వి.సత్యవతి, ఎంపీ

# మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

- ప్రగతి, సంక్షేమాల్లో అగ్ర పీఠం వారికే..
- చరిత్రలో నిలిచిపోయే ఆదర్శ పాలన
- మాడుగులను మోడల్‌గా తీర్చిదిద్దుతా..
- వైఎస్సార్ ఆసరా సభలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు





వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును స్వయంసహాయక సంఘాల సభ్యులకు అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, (కింది చిత్రం) ఆసరా సభకు హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

మాడుగుల: రాష్ట్రంలో ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం నిర్దేశించుకున్నారని, అందులో భాగంగానే వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, జగనన్న ఇల్లు, తదితర పథకాలను అమలు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సీఎంగా దేశ చరిత్రలో నిలిచిపోతారన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీకి డ్వాక్రా మహిళలతో మంగళవారం మాడుగులలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. తండ్రి వైఎస్సార్ బాటలో నడుస్తూ పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. మాడుగుల నియోజకవర్గ ప్రజలు జగనన్న కుటుంబంగా ఏర్పడ్డారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ మాడుగుల కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. మాడుగులను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయని, ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పథకాలు చేరుతున్నాయన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల వడ్డాది–తాటిపర్తి ప్రధాన రహదారి నిర్మాణం నిలిచిపోయిందని, రీటెండరు పిలిచి, కింతలి రోడ్డుకు కూడా నిధులు మంజూరు చేసి త్వరలో ఈ రెండు రోడ్లు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాడుగుల మండలం డ్వాక్రా సంఘాలలో 15,182 మంది సభ్యులకు రూ.10 కోట్ల 81 లక్షల నమూనా చెక్కును ముత్యాలనాయుడు అందజేశారు.

### మహిళలకు పెద్ద పీట

ఉత్తరాంధ్ర జిల్లాల సచివాలయ కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్వాక్రా రుణమాఫీ హామీని చంద్రబాబు విస్మరిస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకంతో ఆదుకున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలలో, చట్టసభలలో మహిళలకు పెద్ద పీట వేసిన మహానుభావుడు సీఎం జగన్ అని కొనియాడారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ మాట్లాడారు. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, తహసీల్దార్ పీవీ రత్నం, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమ సంఘ డైరెక్టర్ గొళ్ళవిల్లి ప్రభావతి, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శేనాపతి కొండలరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబర్ షేక్ ఉన్నీసా బేగం, సర్పంచ్‌లు ఎడ్ల కళావతి, గొళ్ళవిల్లి సంజీవరావు, కాళింగ కళ్యాణరాజు, కొసిరెడ్డి కృష్ణమూర్తి, తాళ్ళపురెడ్డి రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొద్దపు భాస్కరరావు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న స్టాల్స్

ఆసరా సభ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. దేశవాళీ గోజాతి పెంపకం, ఐసీడీఎస్ ద్వారా చిరు ధాన్యాలతో చేసిన పిండి వంటలు, మహిళా మార్టులు తదితర స్టాల్స్‌ను అతిథులు పరిశీలించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. వారిని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఆశీర్వదించారు.

## క్లుప్తంగా

### విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

**యలమంచిలి:** విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం యలమంచిలి స్టేషన్ రోడ్డు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలన్నారు. ప్రతి విద్యార్థి పదిలో చక్కటి ప్రతిభ కనబరిచి భవిష్యత్ ప్రణాళికలు వేసుకుని జీవితంలో రాణించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యుత్ తీగ తగిలి బాలుడికి తీవ్ర గాయాలు


108 వాహనంలో బాలుడిని తరలిస్తున్న దృశ్యం

**హుకుంపేట:** మండలంలోని మత్స్యపురం గ్రామంలో బాలుడికి విద్యుత్ తీగ తగిలి తీవ్ర గాయలయ్యాయి. గ్రామానికి చెందిన జి.సుమతి, బొజ్జన్న కుమారుడు అజయ్ (11) మంగళవారం ఇక్కడ పెదగరువు వంతెన సమీపంలో తన స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. హుకుంపేట ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో బాలుడు ఆరో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పెదగరువు వంతెన సమీపంలో విద్యుత్ తీగలు వేలాడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# క్షమించండి.. వెళ్లిపోతున్నాం

- సంచలనం రేపిన ఉక్కు ఉద్యోగి, అతని భార్య సెల్ఫీ వీడియో
- కొప్పాకలోని ఏలేరు కాలువ వద్ద బైక్, చెప్పులు, బ్యాగు, ఫోన్ గుర్తింపు
- మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న దువ్వాడ పోలీసులు
- గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు


సెల్ఫీ వీడియోలో రోదిస్తున్న ఉక్కు ఉద్యోగి వరప్రసాద్, అతని భార్య


ఏలేరు కాలువ వద్ద ఉన్న చెప్పులు

**కూర్మన్నపాలెం:** 'మేము వెళ్లిపోతున్నాం.. అంతా జాగ్రత్తగా ఉండండి. తమ్ముడిని, నాన్నమ్మను జాగ్రత్తగా చూసుకోండి. అల్లుడు గారు.. నా కూతురు అమాయకురాలు.. జాగ్రత్తగా చూసుకోండి.. మీకు ఇవ్వాల్సింది ఇవ్వకుండానే వెళ్లి పోతున్నాం. మమ్మల్ని క్షమించండి.. బైబై..' అంటూ ఓ దంపతుల సెల్ఫీ వీడియో సంచలనం సృష్టించింది. గాజువాకలోని వడ్లపూడి పరిధి తిరుమలనగర్‌లో కలకలం సృష్టించిన ఉక్కు ఉద్యోగి, అతని భార్య మిస్సింగ్ మిస్టరీ వీడలేదు. వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. వారి కుమార్తె, పోలీసులు తెలిపిన వివరాలివీ.. వడ్లపూడి తిరుమలనగర్‌లో ఉంటున్న చిత్రాడ వరప్రసాద్(47) స్టీల్‌ప్లాంట్‌లో మాస్టర్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ.. ప్రైవేట్‌గా శ్రీదుర్గా బ్యాటరీ కేర్ షాప్‌ను నడుపుతున్నారు.

భార్య మీరా(41), 19 ఏళ్ల కుమారుడు కృష్ణసాయితేజతో కలిసి వెంకటేశ్వర పారాడైజ్–2 అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. కుమార్తె దివ్యలక్ష్మికి గతేడాది కణితి గ్రామానికి చెందిన మరో ఉక్కు ఉద్యోగితో ఘనంగా వివాహం జరిపించారు. ఈ క్రమంలో వరప్రసాద్ తెలిసిన వాళ్లు, తోటి ఉద్యోగుల దగ్గర సుమారు రూ.60లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో అప్పులిచ్చిన వారంతా నిత్యం డబ్బులు చెల్లించాలని ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నారు. అప్పుల బాధ భరించలేని వరప్రసాద్, అతని భార్య మీరా సోమవారం ఉదయం 11 గంటలకు కూతురు దివ్య లక్ష్మికి ఫోన్ చేసి తమ్ముడిని, నాన్నమ్మను జాగ్రత్తగా చూసుకోమని ఆవేదనతో మాట్లాడారు. కంగారుపడిన దివ్యలక్ష్మి తల్లిదండ్రుల వద్దకు వచ్చి ధైర్యం చెప్పింది. మీరు ఏమీ చేసుకోవద్దు. అటువంటి ఆలోచనలు ఉంటే తమ్ముడు మీద ఒట్టు అని ఒట్టు వేయించుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి తన అత్తవారింటికి వెళ్లిపోయింది. కొడుకు కృష్ణసాయి తేజ, నాన్నమ్మ షాప్ నుంచి 2 గంటలకు ఇంటికి వచ్చారు. తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి మళ్లీ తిరిగి షాప్‌కు వెళ్లిపోయారు. సాయంత్రం 6 గంటలకు ఇంటికి వచ్చిన కృష్ణసాయి తేజకు అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ ఇంటి తాళాలు ఇచ్చాడు.

అమ్మానాన్న ఎక్కడికి వెళ్లారని వాచ్‌మన్‌ను అడగ్గా.. తెలియదంటూ జవాబు ఇచ్చాడు. కంగారు పడిన కృష్ణసాయితేజ ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై ఫ్యామిలీ ఫొటో, తల్లి మొబైల్‌లో సెల్ఫీ వీడియో ఉంది. వెంటనే తండ్రి వరప్రసాద్‌కు ఫోన్ చేశాడు. 5, 10 నిమిషాల్లో ఇంటికి వస్తానని చెప్పిన తండ్రి.. ఎంత సేపైనా ఇంటికి రాలేదు. మరలా ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి ఆరా తీశాడు. ఆచూకీ తెలియకపోవడంతో వెంటనే దువ్వాడ పోలీసులకు జరిగిన విషయాన్ని చెప్పాడు. పోలీసుల వరప్రసాద్ ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేశారు. లొకేషన్ ఆధారంగా అనకాపల్లి జిల్లా కొప్పాకలోని ఏలేరు కాలువ వద్ద వరప్రసాద్, అతని భార్య మీరాకు సంబంధించిన చెప్పులు, బ్యాగు, ఫోన్, బైక్‌ను గుర్తించారు. ఐదుగురు గజ ఈతగాళ్లను రప్పించి సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి మళ్లీ గాలింపు చర్యలు కొనసాగుతాయని అనకాపల్లి ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పరువు పోతుందనే భయంతోనేనా..?**

చిత్రాడ వరప్రసాద్ ఉక్కు ఉద్యోగి. వరుస సంఘటనలు ఆయన్ని అప్పుల పాల్జేశాయి. వెన్నునొప్పితో తీవ్రంగా బాధపడుతున్నాడు. గతంలో భార్యాభర్తలిద్దరికీ కరోనా సోకింది. గతేడాది కుమార్తె దివ్యలక్ష్మికి వివాహం చేశాడు. అప్పు చేసి కుమారుడితో ఓ బ్యాటరీ షాపు పెట్టించాడు. తోటి ఉద్యోగుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు చేయడం, అప్పు ఇచ్చినవారు నిత్యం ఇంటికి వచ్చి అప్పు తీర్చాలంటూ ఒత్తిడి చేయడంతో వరప్రసాద్ మానసికంగా కుంగిపోయాడు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెరమీదకు రావడం, అప్పుల ఇచ్చిన వాళ్లు అధిక ఒత్తిడి తీసుకురావడంతో.. వాటిని ఎలా తీర్చాలంటూ కుటుంబ సభ్యులకు చెప్పి నిత్యం ఆవేదన చెందేవారు. కాగా.. అప్పులు ఇచ్చిన వారి వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకున్నారా? వారు ఎక్కడైనా ఉన్నారా? మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలు, ఉద్యోగుల సహకారంతో ప్రగతి పథం


స్టేక్ హోల్డర్స్ సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులతో ఎన్టీపీసీ జీజీఎం సిన్హా

**పరవాడ:** నిర్వాసిత గ్రామాల ప్రజలు, ఉద్యోగుల సహకారంతో సింహాద్రి ఎన్టీపీసీ అభివృద్ధి పథంలో నడుస్తుందని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్‌లోని స్టేక్ హోల్డర్స్ (వాటాదారులు) సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే సంస్థ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సీఎస్సార్ నిధులతో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఏజీఎం హెచ్ఆర్ రుమాఢిశర్మ, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోపీఆర్డీ పద్మజ, ఎంఈవో సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ, వ్యవసాయాధికారి చంద్రావతి, పంచాయతీరాజ్ ఏఈ రామారావు, వాడచీపురుపల్లి, పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు కనకప్పారావు, ఐ.ఆర్.రంజిత్ పాల్గొన్నారు.

# రూ.54.04 కోట్లతో సింహగిరి అభివృద్ధి

- వారం రోజుల్లో 'ప్రసాద్'పనులకు టెండర్లు
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా

**సింహాచలం:** వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీమ్ కింద మంజూరు చేసిన రూ.54.04 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు వారం రోజుల్లో టెండర్లు పిలుస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. వరాహ లక్ష్మీ నృసింహస్వామిని మంగళవారం ఆమె దర్శించుకున్నారు. ఆనంద నిలయంలో ప్రసాద్ పథకంలో భాగంగా చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళిక, కట్టడాల డిజైన్లను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టూరిజం శాఖ ఇంజినీరింగ్ అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి రోజా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ప్రసాద్ స్కీమ్ నిధులు రూ.24.13కోట్లతో బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను పూర్తి చేసి ఇటీవలే ప్రారంభించినట్లు చెప్పారు. శ్రీశైలం దేవస్థానంలో రూ.43.08 కోట్ల ప్రసాద్ స్కీమ్ నిధులతో పనులు పూర్తి చేసి రాష్ట్రపతితో ప్రారంభించామన్నారు. రానున్న వారం రోజుల్లో సింహాచలం దేవస్థానానికి సంబంధించి పనులకు టెండర్లు పిలుస్తామని వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం, టూరిజం శాఖ ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని.. అందుకనుగుణంగా సింహగిరిని అభివృద్ధి చేస్తామన్నారు. భక్తులు వేచి ఉండేందుకు రెండు భారీ డార్మిటరీ హాళ్లను నిర్మిస్తామన్నారు. భారీ క్యూ కాంప్లెక్స్, ఆధునిక పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్, భక్తులకు త్వరితగతిన అన్నప్రసాదం అందించేందుకు మెకనైజ్డ్ కిచెన్ పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 3,500 మందికి, శని, ఆదివారాల్లో 5 వేల మందికి అన్నప్రసాదం అందిస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం రాజగోపురం ఎదురుగా థియేటర్ నిర్మాణం, నడిచే భక్తుల కోసం 1000 మెట్లను విస్తరిస్తామని చెప్పారు. సింహగిరి ఘాట్‌రోడ్డులో భక్తులకు ఉచిత సౌకర్యం కల్పించేందుకు ఆరు మినీ బ్యాటరీ కార్లు, చార్జింగ్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. గంగధార వద్ద దుస్తులు మార్చుకునేందుకు 10 గదులు నిర్మిస్తామన్నారు. సింహగిరి అందాలు ఆస్వాదించేలా 12 వ్యూ పాయింట్లు సిద్ధం చేస్తామన్నారు. ఏడాదిలోనే పనులు పూర్తి చేసేలా దృఢసంకల్పంతో ముందుకెళ్తామన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాన్నింటిని దర్శించుకునేలా బస్సు సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. యాప్ రూపొందించి అందులో ఆలయాల వివరాలు పొందుపరుస్తామన్నారు. ఆలయాలు, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని వివరించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఈవో త్రినాథరావు, పర్యాటకశాఖ ఈడీ మల్లిరెడ్డి, చీఫ్ ఇంజినీర్ మూర్తి, ఈఈ రమణ, సింహాచలం దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**అప్పన్నను దర్శించుకున్న మంత్రి రోజా**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం మంత్రి ఆర్.కె.రోజా దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని దేవస్థానం ఈవో త్రినాథరావు అందజేశారు.

# నారాయణ కాలేజీ విద్యార్థిని బలవన్మరణం

- బోయపాలెం క్యాంపస్‌లో విషాదం


సాయిశ్రీ (ఫైల్)

**పీఎం పాలెం :** అనారోగ్యం, చదువులో మార్కులు సరిగ్గా రావన్న వేదనతో ఓ విద్యాకుసుమం రాలిపోయింది. సోమవారం సాయంత్రం జరిగిన సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం జన్నవలస గ్రామానికి చెందిన ముమ్మిన వెంకట చిరంజీవి లారీ డ్రైవర్ కాగా భార్య ప్రైవేటు స్కూలులో టీచర్‌గా పనిచేస్తుంది. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె సాయిశ్రీ (17) బోయపాలెంలోని నారాయణ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం ఎంపీసీ సెకండ్ ఇయర్ పరీక్షలు రాస్తోంది. ఆమె చాలా కాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతోంది. అనారోగ్యం కారణంగా చదువులో అనుకున్న స్థాయిలో రాణించలేకపోతోంది. ఈ విషయమై మానసికంగా కుంగిపోయింది. సోమవారం ఫిజిక్స్ పరీక్ష సరిగా రాయనందున మార్కులు తక్కువగా వస్తాయని మనస్తాపం చెందింది. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంతకు ముందు తన మరణానికి గల కారణం సూసైడ్ నోట్‌లో రాసింది. తనకు మార్కులు తక్కువ వస్తే కష్టపడి చదివిస్తున్న అమ్మ నాన్నల ముందు తలెత్తుకోలేనని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. చెల్లి బాగా చదువుకుని అమ్మనాన్నలకు మంచి పేరు తేవాలని, తనను క్షమించమని ఆ నోట్‌లో పేర్కొంది. విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించిన కళాశాల సిబ్బంది వెంటనే కొమ్మాది గాయత్రి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మరణించినట్టు ఆస్పత్రి వర్గాలు ధ్రువీకరించాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి ఎస్ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కోమాలోకి రైతు... కాపాడిన కిమ్స్ ఐకాన్ వైద్యులు


ప్రాణాపాయం నుంచి బయటపడిన రైతు

**అక్కిరెడ్డిపాలెం :** కోమాలోకి వెళ్లిన రైతుకు కిమ్స్ ఐకాన్ వైద్యులు చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ న్యూరో సర్జన్ డాక్టర్ సీహెచ్.విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా చోడవరం ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల రైతుకు ఈ నెల 13న ఉదయం 6 గంటల సమయంలో కడుపు నొప్పి వచ్చింది. దీంతో అతని కుటుంబ సభ్యులు స్థానికంగా ఉండే వైద్యుడికి చూపించగా స్కానింగ్ చేయాలని చెప్పారు. ఆ సమయంలో స్కానింగ్ చేయడానికి వీలుకాకపోవడంతో రైతును ఇంటికి తీసుకెళ్లిపోయారు. దీంతో రైతు ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది. కాళ్లు, చేతులు కదల్లేని పరిస్థితి. బతికున్నాడో లేదో కూడా తెలియకపోవడంతో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. కోమాలో ఉన్న రైతును వైద్యులు పరీక్షించగా ప్రాణం ఉందని గుర్తించి, వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ప్రారంభించారు. న్యూరాలజీ పరీక్షలు చేయగా రోగి అంతర్గత వ్యవస్థ బాగానే ఉందని తేలింది. కళ్లకు సంబంధించిన నరాలు పరీక్షిస్తే అవి స్పందించలేదు. ఊపిరి బాగా బరువుగా తీసుకోవడం, గుండె నిమిషానికి 100 సార్లకుపైగా కొట్టుకోవడం, బీపీలో తేడాలు ఉన్నట్లు గమనించారు. తొలుత కొన్ని మందులు ఇచ్చినా అతని ఆరోగ్య పరిస్థితి మెరుగు కాలేదు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. కోమాలో ఉన్న రైతు పాము కాటుకు గురై ఉంటాడని భావించి విరుగుడు మందు ఇచ్చారు. దీంతో అతని అవయవాలు మెల్లమెల్లగా సాధారణ స్థితికి వచ్చాయి.

దాదాపు బ్రెయిన్‌డెడ్ పరిస్థితుల్లోకి వెళ్లిన రైతుకు వారం రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స అందించినట్లు వెల్లడించారు. మంగళవారం అతన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


# శిల్పారామాల పనితీరు సూపర్

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా


శిల్పారామంలో దండలు పరిశీలిస్తున్న మంత్రి రోజా

**పీఎం పాలెం:** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిల్పారామాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని ఆ శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం ఆమె మధురవాడ సమీపంలోని శిల్పారామంను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ విషయంలో జగనన్న పాలన దేశంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. శిల్పారామంలో సందర్శకుల అభిరుచికి అనుగుణంగా వాటర్ పార్క్ ఏర్పాటు చేశామని, జిమ్ సదుపాయం కల్పించామనన్నారు. గత ఏడాది కంటే శిల్పారామాలను సందర్శించే వారు 125 శాతం పెరిగారన్నారు. అనంతరం శిల్పారామంలో కొనసాగుతున్న గ్రామీణ హస్తకళ ఉత్పత్తుల స్టాల్‌ను ఆమె పరిశీలించారు. తాటి మొవ్వ ఆకులతో తయారు చేసిన ఆకర్షణీయమైన దండలు, గోగు నారతో తయారు చేసిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. అన్ని స్టాల్స్‌లో ఉన్న ఉత్పత్తులను పరిశీలించి కళాకారులను అభినందించారు. ఇటీవల ప్రారంభించిన స్విమ్మింగ్ పూల్ వాటర్ పార్కును మంత్రి రోజా సందర్శించారు. ఆమెతోపాటు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర శిల్పారామాల ప్రత్యేక అధికారి డి.శ్యామ్ సుందరరెడ్డి, స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథ రెడ్డి తదితరులు ఉన్నారు.

# గంజాయి కేసులో మరో ముగ్గురి అరెస్టు


నిందితులు కొంతా సుధాకర్, వంతల భగవాన్, బబ్లూకుమార్ యాదవ్

**కశింకోట:** గంజాయి కేసుతో సంబంధం ఉన్న వారిలో మరో ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేసినట్లు సీఐ రవికుమార్, ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. గత ఆదివారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ నుంచి అనకాపల్లి వైపు లారీలో బియ్యం బస్తాల మాటున తరలిస్తున్న 890 కిలోల గంజాయి బస్తాలను కశింకోట పోలీసులు పట్టుకుని డ్రైవర్ హరదేవ్ సింగ్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పరారైన అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం లచ్చలపుట్టు గ్రామానికి చెందిన కొంతా సుధాకర్ ఎలియాస్ సుధీర్(25), జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పాలెం జిల్లా విష్ణుపూర్ గ్రామానికి చెందిన బబ్లూ కుమార్ యాదవ్(27), ముంచంగిపుట్టు మండలం గంతుర్‌మండ గ్రామానికి చెందిన వంతల భగవాన్(29)లను అనకాపల్లి బస్సు స్టేషన్‌లో అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరిలో సుధాకర్ గంజాయి రవాణా వాహనాలకు పైలట్‌గా వ్యవహరిస్తున్నాడన్నారు. ఈ కేసులో గంజాయి కొనుగోలు చేసిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ధర్మేంద్ర గుప్తా, చందన గుప్తా, పాడేరుకు చెందిన కిల్లో వాసుదేవ్‌లకు గంజాయి రవాణాలో సహకరించాడన్నారు. వంతల భగవాన్ మాచ్‌ఖండ్ పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసులో అరెస్టు అయి మూడేళ్లపాటు కోరాపుట్ జైలులో ఉండి 2022 నవంబర్‌లో కండిషనల్ బెయిల్‌పై విడుదల అయ్యాడన్నారు. మరలా వీరితో చేతులు కలిపి గంజాయి రవాణాకు సహకరించాడన్నారు.

ధర్మేంద్ర గుప్తా వద్ద కారు డ్రైవర్‌గా బబ్లూ కుమార్ యాదవ్ పని చేస్తూ గంజాయి రవాణాలో భాగస్వామిగా నిలిచాడన్నారు. దీంతో వీరిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన ధర్మేంద్ర గుప్తా, కిల్లో వాసుదేవ్, చందన గుప్తాలతోపాటు మరికొంత మంది పరారీలో ఉన్నారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 41 రోజులకుగాను 2కోట్ల 6లక్షల 11వేల 210 రూపాయలు వచ్చినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 100.600 గ్రాముల బంగారం, 12.495 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# డీసీసీబీ అభివృద్ధికి సంస్కరణలు

**బ్యాంకు చైర్‌పర్సన్ చింతకాయల అనిత**


సభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ చింతకాయల అనిత

**గోపాలపట్నం (విశాఖ పశ్చిమ):** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధికి పలు సంస్కరణలు చేపట్టామని ఆ బ్యాంకు చైర్‌పర్సన్ చింతకాయల అనిత అన్నారు. మంగళవారం మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని బ్యాంకు కార్యాలయంలో 57వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు చేపట్టిందన్నారు. పీఏసీఎస్, ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ తీసుకొచ్చామన్నారు. తొలుత బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహక అధికారి డీవీఎస్ వర్మ వార్షిక ప్రగతి నివేదికను చదివి వినిపించారు. విశాఖ జిల్లాను మూడు జిల్లాలుగా విభజించిన నేపథ్యంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ను మూడు జిల్లాల్లో కార్యకలాపాలు సాగించేందుకు బైలా సవరణ, జీఎం, ఏజీఎం, అంతర్ జిల్లా బదిలీలు తదితర అంశాలను మహాజన సభలో ఆమోదించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ రామచంద్రరాజు, బాంకు పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ సభ్యులు, ఆప్కాబ్ డీజీఎం, నోడల్ అధికారి ఎం.అశ్వని, డీఆర్ఏఎస్డీ ఎం.హరిప్రసాద్, సహకార సంఘాల చైర్‌పర్సన్లు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

**కంచరపాలెం:** కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(టెక్నికల్) కె.సుధ తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, సినర్జీస్ కాస్టింగ్స్ లిమిటెడ్, మ్యాక్స్ ఫాషన్స్ కంపెనీల్లో 580 ఖాళీల భర్తీకి జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ట్రైనీ కెమిస్ట్, ట్రైనీ ఆపరేటర్, క్యాషియర్, టెక్నీషియన్ హెల్పర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్లు ఉన్న పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.ncs.gov.inలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

**పాత ఐటీఐ బాలికల క్యాంపస్‌లో..**

జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్ పాత ఐటీఐ బాలికల క్యాంపస్‌లో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్(ఎస్సీ, ఎస్టీ) అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. ఐడీఏఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, మెడిప్లస్‌కు సంబంధించి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో 100 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సేల్స్, ఆఫీసర్స్, హౌస్ ఎగ్జిక్యూటివ్స్, ఫార్మాసిస్ట్, డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 22–40 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు www.ncs.gov.inలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

## పలు రైళ్ల దారి మళ్లింపు

**తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర):** చెన్నై డివిజన్, చెన్నై సెంట్రల్–బేసిన్ బ్రిడ్జి మధ్య బ్రిడ్జి పునర్నిర్మాణం నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. • ధన్‌బాద్‌లో ఈ నెల 31 నుంచి వచ్చేనెల 24వ తేదీ వరకు బయల్దేరే ధన్‌బాద్–అలప్పుజ (13351) ఎక్స్‌ప్రెస్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మీదుగా కాకుండా వయా కొరుక్కుపేట, వ్యాసర్‌పడి, పెరంబూర్ మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం పెరంబూర్‌లో హాల్ట్ ఇచ్చారు. • అలప్పుజలో వచ్చే నెల 2న బయల్దేరే అలప్పుజ–ధన్‌బాద్(13352) ఎక్స్‌ప్రెస్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మీదుగా కాకుండా వయా పెరంబూర్, కొరుక్కుపేట, చెన్నై బీచ్ స్టేషన్‌ల మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం పెరంబూర్, చెన్నై బీచ్ స్టేషన్లలో హాల్ట్ ఇచ్చారు.


సాక్షి క్లాసిఫైడ్స్

Education

ONE SITTING

■ ONE SITTING : 10th, 12th, B.A.,B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA., BCA., MBA., MCA., Nursing, Pharmacy, Dip invet, B.Tech from Recog. University in INDIA (For Discontinued) Exam in April. Cont : 73383 76874 [R-963]

Real Estate

FLAT FOR SALE

■ 2 BHK 730 1st Floor in Group House Sector-3 MVP Colony in Sree Ram Residency Near Little Angels School Rs.42.95 Lakhs. Ph : 74169 24481 [V- 775230]

■ 3 BHK 1560 SQ. Ft 5th Floor Fully Furnished Beach & Park Views From Balcony Behind Iscon Temple Beach Road Avail Bank Loan EMI. Ph : 77383 07234 [V- 775229]

■ 3 BHK 1400 Sft Flat with 24 Hrs wtr, CP, CC Camaras, 4th Flr, with Xlent, View. Marble Flr, Cup Boards Fans, RO WTR @ 1 CR. Ph : 92906 63125, 92473 62689 [V-5666]

Services

BUSINESS

■ మేము మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. అలాగే ఏజెంట్లను కూడా ఆహ్వానిస్తున్నాము. ఫోన్: 9092692408 [IA-157]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 4197]

MARRIAGE SERVICE

■ ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కమ్మ, కాపు మరియు అన్ని కులముల వారికి (1st or 2nd) వివాహ సంబంధాలు చూడబడును. (Software, Doctor, Abroad Matches also). మంచి Biodata ఉన్నవారు మాత్రమే. సంప్ర : 89776 36484 [V- 10363]

T.V. REPAIR

■ SVS TV రిపేర్స్ : 83677 16961 LED, LCD, A/C, వాషింగ్ మిషన్స్, ఫ్రిజ్, మైక్రోఓవెన్, మీ ఇంటి వద్దనే స్పాట్ రిపేర్ చేయబడును. 25 సం॥ Ex, 5 సం॥ వారంటీ కలదు. [V-776910]

Wanted

■ విజయవాడలో ప్రముఖ హోంకేర్ ఆఫీస్‌కి వృద్ధులకు, బెడ్‌పేషంట్ లను వారి ఇంటి వద్దే చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F కావలెను. జీతం 15-20K వసతి+భోజనం॥ 94942 25282, 72070 72559 [B-970]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795283]

■ సాగర్‌నగర్, కాంప్లెక్స్ ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ (M/F) సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ (Ex ఆర్మీ or సివిల్) కావలెను. జీతం : 12k to 18k. ఫోన్: 97057 67888, 88858 68111 [V- 1798]

■ ఉద్యోగ అవకాశములు : విశాఖలో నెం.1 ISO స్టాండర్డ్‌గా అభివృద్ధి చెందిన మా బ్రాంచ్లో ఈ క్రింది ఉద్యోగాల కొరకు అభ్యర్థులు కావలెను. 1) సీనియర్ మేనేజర్స్ - 5, 35 + Rtd. ప్రైవేట్ & పబ్లిక్ సెక్టార్, 2 సం॥ అడ్మినిస్ట్రేషన్‌లో అనుభవం ఉండాలి. 2) ఆఫీసు ఇంచార్జ్ - 10, 30 + ఏదైనా డిగ్రీ, 3) రెసిడెన్షియల్ ఆఫీసర్స్ - 15 No. పార్ట్ / ఫుల్ టైం / వర్క్ ఫ్రమ్ హోమ్, మహిళలకు ప్రాధాన్యత. ఇంటర్వ్యూ ఈ రోజు & రేపు. పై అభ్యర్థులకు జీతం + ఇన్సెంటివ్స్ ఇంటర్వ్యూలో నిర్ణయిస్తాం. ఫోన్: 99089 08990/99854 61280 [V- 612]

■ ఋషికొండలో పనిచేయుటకు లేడీ సెక్యూరిటీ సూపర్‌వైజర్ (ఇంటర్ or డిగ్రీ, 8hrs జనరల్ షిఫ్ట్, 16000/-rs), గార్డులు కావలెను. (8hrs, 15000/-rs). Ph : 88858 68111, 97051 56111 [V- 1790]

■ Wanted DTP / NET Operator. Part / Full Time. Attractive Salary. Sai Net, RTC Complex, Dwarakanagar, Vizag-16. Ph : 98482 81659, 90009 20204 [V- 1793]

■ URGENT REQUIREMENT AT GUDUR for Manufacturing Company. Drivers-05, Fitters-12, Welder-12 and Business Development Associate-10 (Any Graduate). Please Mail us at : job.gdrp@gmail.com [N-1226002]

CHANGE OF NAME

I, PENKEY VEERA SATYA SURYA KUMAR S/o Penkey Gopinadh (Late), D-No. 9-168, RTC Nagar, Sai Colony, Near AMAL College, Kotturu, Anakapalli Dist-531004. have changed my wife's name from SHILPI PENKEY (Old Name) to SHILPI MEDISETTI (New Name) hence after all my documents and correspondence will continue with my wife's New Name SHILPI MEDISETTI for all purposes.

■ OPDSS సెక్యూరిటీ సంస్థయందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతంతో పాటు PF+ESI సౌకర్యం కలదు. ఫోన్: 90595 98586, 79811 56210 [V- 1794]

■ మహిళలకు గొప్ప సువర్ణ అవకాశం. మీకు తెలిసిన వంట నైపుణ్యంతో మీ ఇంటివద్ద నుండే స్థిరమైన ఆదాయాన్ని పొందండి, ఉచిత సెమినార్ లో పాల్గొనేందుకై షీరో హోమ్ ఫుడ్ 7200362930. [H-796765]

■ Req. "Back - End Verification Executives" for Credit Card. Bike & Smart phone must. Whats App Resume : 9652316496 [UA-597]

■ ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా.సు. జీ.15K to 34K ఇంట్రెస్ట్ ఉన్నవారు డిటెయిల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్: 6281159171 [HA-28700]

■ Work From Home Telicaller Qualification-10th 12th Age 25 to 45 Male & Female MOB-9654255940 [HA-10761]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

## క్లుప్తంగా

### మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన నూకాంబిక ఆలయ ఈవో



మంత్రి అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రసాద్

**అనకాపల్లిటౌన్ :** నూకాంబిక ఆలయ ఈవో బండారు ప్రసాద్ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు మంత్రి అమర్‌నాథ్‌కు ప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేశారు. ఆలయానికొచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఈవో ప్రసాద్‌ను మంత్రి అమర్‌నాథ్ ఆదేశించారు.

### వైఎస్సార్ బీమా అందజేత



జమాదులపాలెంలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందిస్తున్న నాయకులు

**కశింకోట :** మండలంలోని జమాదులపాలెం గ్రామంలో మృతి చెందిన ఒమ్మి నాగరాజు దహన సంస్కారాల నిమిత్తం కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల సహాయాన్ని మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒమ్మి రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, మాజీ ఉప సర్పంచ్ గంగునాయుడు, పార్టీ గ్రామాధ్యక్షుడు సానబోయిన శ్రీను, పార్టీ సీనియర్ నాయకుడు బొట్టా రాజారావు, సచివాలయ కార్యదర్శి నారాయణమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత పాల్గొన్నారు.

### 'రెగ్యులర్ సిబ్బందిని కేటాయించండి'

**అనకాపల్లిటౌన్ :** నియోజకవర్గంలో ఇన్‌చార్జి అధికారుల పాలనకు స్వస్తి పలికి రెగ్యులర్ అధికారులను నియమించాలని సీపీఐ నేత కోన లక్ష్మణ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీడీవో, డీఎస్పీ పోస్టుల్లో ఇన్‌చార్జిల పాలన సాగుతోందని, తక్షణమే ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని రెగ్యులర్ సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 2,441 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 4,030 | 4,280 |
| మొదటి రకం | 3,810 | 4,210 |
| రెండో రకం | 3,500 | 4,000 |
| మూడో రకం | 3,070 | 3,400 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| సార్ | రాజా |
| కోస్టీ | సత్యనారాయణస్క్రీన్-1 |
| జాన్‌విక్ (చాప్టర్-4) | సత్యనారాయణస్క్రీన్-2 |
| కబ్జా | షిర్డిసాయి |
| బలగం | పర్తిసాయి |
| రంగమార్తాండ | వెంకటేశ్వర |
| పులి | శ్రీసత్య |
| దాస్ కా ధమ్కీ | రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 98 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-40 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-43 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్ :** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 332 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.


సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!

లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!

సంప్రదించవలసిన నెంబరు

9966329167, 9912440601


# వేసవి నేస్తాలు.. పుచ్చకాయలు

- పెరుగుతున్న ఎండలు.. ఊపందుకున్న విక్రయాలు
- పట్టణంలో రోడ్ల పక్కన తాత్కాలిక దుకాణాలు
- పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతులు



పట్టణంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పుచ్చకాయలు, (ఇన్‌సెట్) ముక్కలుగా కోసి విక్రయాలు

**అనకాపల్లి రూరల్ :** శీతాకాలం నుంచి వేసవిలోకి చేర్చే మార్చి నెల పూర్తి కావస్తోంది. చలికి దుప్పటి కప్పుకునే రోజులు పోయి ఉక్కబోతతో వేసుకున్న దుస్తులు తడిచిపోయేలా ఎండలు పెరుగుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందడానికి పుచ్చకాయల వైపు అనకాపల్లి పట్టణ ప్రజలు పరుగులు తీస్తున్నారు. మండుటెండలో అలసిన శరీరానికి ఎర్రని పుచ్చకాయ ముక్క తింటే ఆ ఆనందమే వేరు. అనకాపల్లి పట్టణంలో అన్ని వైపులా ప్రధాన రహదారుల పక్క తాత్కాలిక గుడారాలు, తోపుడు బండ్లపై పుచ్చకాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

**పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి**

కంటికి ఇంపుగా.. నోటికి తీయగా అనిపించే ఈ పండు తినేవారికి ఆరోగ్యమే కాదు, వ్యాపారులకు ఆదాయాన్ని కూడా తెచ్చిపెడుతోంది. ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరి, చెన్నై, నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి సమీపంలోని నల్లజర్ల తదితర ప్రాంతాల నుంచి పుచ్చకాయలు పట్టణానికి దిగుమతి చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి హోల్‌సేల్ వ్యాపారులు పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

**పుచ్చకాయల్లో రకాలు**

పుచ్చకాయల్లో షుగర్‌బేబీ, నాందారి, ఆర్కిమెన్ తదితర రకాలున్నాయి. మొత్తంగా నల్ల, తెల్ల రంగు కాయలుగా పిలుస్తారు. నల్లకాయలు అన్ని కాలాల్లోనూ పండుతాయి. నల్లకాయలు విజయవాడ సమీప ప్రాంతాల్లో ఎక్కువగా దొరుకుతాయి. తెల్లకాయలు తమిళనాడు, నెల్లూరు ప్రాంతాల నుంచి తెస్తారు. ప్రస్తుతం కేజీ రూ.15 నుంచి రూ.25 మధ్యన అమ్ముతున్నారు. కొన్ని చోట్ల కాయ సైజ్‌ను బట్టి రూ.100 నుంచి రూ.200 మధ్య విక్రయిస్తున్నారు. ముక్కలు కోసినవైతే రూ.10, రూ.20 సైజుల్లో అమ్ముతున్నారు.

**ఊపందుకున్న విక్రయాలు**

అనకాపల్లి పట్టణంలోని దుకాణాల్లో పెద్ద మొత్తంలో హోల్‌సేల్, రిటైల్ పుచ్చకాయల వ్యాపారం జరుగుతోంది. ఇక్కడి నుంచి చుట్టుపక్కల మండలాలకు కూడా సరఫరా చేస్తున్నారు. పట్టణంలో చిన్న చిన్న దుకాణాలతో పాటు తోపుడు బండ్ల ద్వారా రహదారుల వెంట పుచ్చకాయలు, ముక్కలుగా చేసి విక్రయాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాపారం రూ.లక్షల్లోనే సాగుతోంది. ఈ నెల రోజుల్లో ఆరు లోడుల పుచ్చకాయలు విక్రయించినట్టు ఓ వ్యాపారి చెప్పాడు.

### వ్యాపారం ఊపందుకుంది



వేసవిలో పుచ్చకాయల విక్రయాలకు మంచి సీజన్. ఐదారు నెలలు వ్యాపారం ఉంటుంది. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పుచ్చకాయలను ఖరీదు చేసి తెస్తాం. కొన్ని సార్లు నష్టాలు కూడా భరించాల్సిందే. పది లోడులు తెస్తే.. ఒకటి రెండు రోడుల్లో కాయలు దెబ్బతిని వస్తుంటాయి. ప్రజల ఆదరణవల్ల ప్రస్తుతం వ్యాపారం బాగానే సాగుతోంది.

– కశింకోట లక్ష్మణరావు, వ్యాపారి

### ఆరోగ్యానికి మంచిది



92 శాతం నీటితో నిండిన 100 గ్రాముల పుచ్చకాయతో 46 కేలరీల శక్తి శరీరానికి అందుతుంది. 170 మి.గ్రా. పొటాషియం, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 26 మి.గ్రా. విటమిన్ ఎ, 12 మి.గ్రా. విటమిన్ సి, 0.1 మి.గ్రా. విటమిన్ బి., 0.6 గ్రాముల ప్రొటీన్, 0.4 గ్రాముల ఫైబర్ ఉంటుంది. కొలెస్ట్రాల్ పెద్దగా లేకపోవడంతో అనారోగ్యం కలిగించదు.

– డాక్టర్ జి.పావని, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, తగరంపూడి

## ఉద్యాన పంటల నష్టంపై సర్వే



టమాటా పంటను పరిశీలిస్తున్న లావణ్య

**అనకాపల్లిటౌన్ :** నియోజకవర్గంలో వర్షాలకు దెబ్బతిన్న ఉద్యానపంటల నష్టపరిహార సర్వే ప్రారంభించినట్టు ఉద్యానశాఖ అధికారి లావణ్య తెలిపారు. గ్రేటర్ విశాఖ విలీన గ్రామాలైన రాజుపాలెం, వల్లూరు, గొర్లివానిపాలెం గ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో పంటనష్టంపై అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపరిహార నిమిత్తం భూమికి సంబంధించిన రైతుల నుంచి 1బీ, ఆధార్, బ్యాంకు ఖాతాల జెరాక్స్‌కాపీలు తీసుకుని, జిల్లాలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యాన అధికారులతోపాటు, వ్యవసాయ విస్తరణాధికారుల పర్యవేక్షణలో నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29న సాత్-2 రైతు భరోసా కేంద్రంలో నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో గణేష్, వ్యవసాయ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ గోడపత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

**అనకాపల్లి రూరల్ :** కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ నేతలు గోడపత్రిక ఆవిష్కరించారు. స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్రావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ నిరంకుశ విధానాల కారణంగా ఇప్పటి వరకు సుమారు 25 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెంచి రైతులకిచ్చే రాయితీలో కోత పెట్టడం దుదృష్టకరమన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని ఆక్షేపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

### నరసింగబిల్లి పీఏసీఎస్ సమావేశం నేడు

**కశింకోట :** మండలంలోని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘ సీఈవో నక్కా అచ్చియ్యనాయుడు మంగళవారం తెలిపారు. సంఘ చైర్‌పర్సన్ గండి నాయుడుబాబు అధ్యక్షతన సంఘ ఆవరణలో జరిగే సమావేశంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఖర్చులు, రాబడి, 2023-24 సంవత్సర అంచనా బడ్జెట్ ఆమోదం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సంఘ సభ్యులు, రైతులు తప్పక హాజరు కావాలని కోరారు.

### యాదవుల సంక్షేమానికి కృషి



వియ్యపు భూలోకనాయుడు

**కశింకోట :** యాదవుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు వియ్యపు భూలోకనాయుడు అన్నారు. మండలంలోని అచ్చెర్లకు చెందిన భూలోకనాయుడును రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ యాదవ్ ఇటీవల అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో యాదవులకు సముచితమైన స్థానాన్ని రాజకీయ పక్షాలు కల్పించాలన్నారు.

## రోడ్లు ఇలా.. రాకపోకలెలా!



అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలోని అసకపల్లి మలుపు వద్ద దెబ్బతిన్న రోడ్డు



సబ్బవరం-లంకెలపాలెం రోడ్డులో అసకపల్లి వద్ద భారీ గుంతలు

**సబ్బవరం:** మండలంలో అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు మొదలయ్యాయి. దీంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. అయితే సబ్బవరంలోని గుల్లేపల్లి జంక్షన్ నుంచి అసకపల్లి జంక్షన్ వరకూ ఉన్న జాతీయ రహదారి పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. దీంతో సబ్బవరం మీదుగా ఉన్న పాత రోడ్డుపై వాహనాలు రద్దీ అధికంగా ఉండటంతో పాటు భారీ వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల వేగం నెమ్మదించింది. తరుచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్డును అభివృద్ధి చేయాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

● పరవాడలోని పరిశ్రమలకు సబ్బవరం మీదుగా జాతీయ రహదారి నుంచి సబ్బవరం-లంకెలపాలెం రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో గోతులమయమైంది. అసకపల్లి సమీపంలో రోడ్డు మరీ దారుణం. వర్షాలు కురిస్తే నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితి. దీంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీపీ సూర్యకుమారి

**సబ్బవరం:** పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు.మండలంలోని మొగలిపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కిట్లతో కూడిన ఎగ్జిబిషన్‌ను ఆమె తిలకించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు,బాలింతలు ,చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న బాలామృతం,పాలు,గుడ్లు,సంపూర్ణ భోజనం,వైఎస్సార్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ గండి మహాలక్ష్మి,ముత్యాలనాయుడు, సూపర్ వైజర్ స్వర్ణ, పంచాయతీ కార్యదర్శి పి. సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ పార్కింగ్.. ట్రాఫిక్ ఇక్కట్లు

- కొత్త జిల్లా ఏర్పాటుతో పెరిగిన వాహనాల రద్దీ
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలకు స్థానికుల వినతి



రేబాక అండర్‌బ్రిడ్జి సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు, నిలిచిన ట్రాఫిక్

**తుమ్మపాల :** అనకాపల్లి-సబ్బవరం రోడ్డు రేబాక జంక్షన్ అండర్ బ్రిడ్జి వద్ద వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ సమస్యలు తప్పట్లేదు. అండర్ బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న సర్వీస్‌రోడ్డులో ఆటోలు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అండర్ బ్రిడ్జి నుంచి అటూఇటుగా వస్తున్న వాహనాలు మలుపు తిప్పేందుకు డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. జంక్షన్లో రాంగ్ పార్కింగ్‌పై పోలీసుల హెచ్చరికల్ని సైతం వాహనదారులు పట్టించుకోవట్లేదు.

గతంలో రేబాక జంక్షన్ ప్రధాన కూడలిగా గొలగాం, గోపాలపురం గ్రామాలకు మాత్రమే రహదారి సౌకర్యం ఉండేది. అతి తక్కువ వాహనాల రాకపోకల దృష్ట్యా జాతీయ రహదారి విస్తరణలో రెండు లైన్ల అండర్ బ్రిడ్జి నిర్మాణంతో సరిపెట్టారు. నూతన జిల్లా ఏర్పాటులో భాగంగా అనకాపల్లికి అతి సమీపంలో ఉన్న శంకరం గ్రామంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ, పోలీస్ కార్యాలయం, వివిధ శాఖల జిల్లా కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. దీంతో ఈ అండర్ బ్రిడ్జి గుండా వాహనాల రాకపోకలు ఒక్కసారిగా పెరిగాయి. మరోవైపు జాతీయ రహదారి ఆరులైన్ల విస్తరణతో ఐదు కిలోమీటర్ల వరకు మరో అండర్ బ్రిడ్జి లేకపోవడంతో మిగిలిన గ్రామాల ప్రజలకు కూడా ఈ మార్గమే దిక్కయింది. బవులువాడ, మామిడిపాలెం, మార్టూరు, మాకవరం గ్రామాల్లో క్వారీ కార్యకలాపాలు కూడా బాగా పెరిగాయి. క్వారీలకు వచ్చే భారీ వాహనాలతో రద్దీ మరింత పెరిగింది. రేబాకలోని పౌరసరఫరాల శాఖ గిడ్డంగికి కూడా సరకు లోడ్ల రాకపోకలు పెరిగాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి తోడు జిల్లా అధికారుల రాకపోకల సమయంలో ట్రాఫిక్ నిలిపేస్తుండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రాంగ్ పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

## టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



పంపిణీ చేసిన పరీక్ష కిట్లతో విద్యార్థులు

**అనకాపల్లి రూరల్ :** తన జీతం నుంచి 132 మంది టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రితో కూడిన కిట్లను అందించి ఆ టీచర్ తన పెద్ద మనసును చాటుకున్నారు. తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మజ్జి రామలక్ష్మి మంగళవారం పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులందరికీ పరీక్ష అట్ట, రెండు పెన్నులు, ఎరేజర్, షార్ప్‌నర్, స్కేల్‌తో ఉన్న ప్రత్యేక కిట్లను అందించారు. ఉన్నత విద్యకు కీలకమైన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మంచి మార్కులు తెచ్చుకోవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. రామలక్ష్మి ఔదార్యాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు తక్షణ సాయం అందజేత



సూరిశెట్టి శివకు బీమా తక్షణ సాయం అందిస్తున్న వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు

**అనకాపల్లిటౌన్ :** స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సూరిశెట్టి అప్పలనర్సమ్మ మృతి చెందడంతో ఆమె భర్త శివకు వైఎస్సార్ బీమాతో భాగంగా దహనసంస్కారాల నిమిత్తం రూ.10 వేలు నగదు సాయాన్ని 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు అందించారు. వార్డులోని 23వ సచివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ బీమా రూ.లక్షలో తక్షణ సాయం కింద రూ.10వేలు అందించినట్టు పేర్కొన్నారు. మిగిలిన బీమా మొత్తాన్ని వీలైనంత వేగంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, జి.సతీష్, బి.ఈశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

## కేంద్రం విధానాలకు నిరసనగా ర్యాలీ



కశింకోటలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న స్థానిక నాయకులు

**కశింకోట :** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఢిల్లీలో ఏప్రిల్ 5న చేపట్టనున్న మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ కశింకోటలో సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, ప్రైవేట్ యాజమాన్యాలకు కొమ్ముకాసేలా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలున్నాయని ఆరోపించారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ న్యాయమైన హక్కులను కాపాడుకునేందుకు చేస్తున్న మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో ఆశ కార్యకర్తలు శాంతి, ఎం.శ్రీదేవి, ఐద్వా జిల్లా నాయకురాలు డీడీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నియంత్రణకు ఫాగింగ్



ఫాగింగ్‌లో సిబ్బంది

**అనకాపల్లిటౌన్ :** స్థానిక మెహర్‌బాబావీధిలో జీవీఎంసీ జోన్ ప్రజారోగ్య విభాగం ఇన్‌స్పెక్టర్ గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం దోమల నియంత్రణకు ఫాగింగ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీలో పూడిక పేరుకుపోవడంతో, చాలా చోట్ల మురుగునీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో వీటి నియంత్రణకు ఫాగింగ్ చేపట్టారు.

## అనకాపల్లి సబ్‌డివిజన్‌లోకి సబ్బవరం, పరవాడ



ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామారావు తదితరులు

**సబ్బవరం:** రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారు అధిక దిగుబడులు సాధించే విధంగా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచించారు. ఇప్పటి వరకూ విశాఖపట్నం అగ్రికల్చరల్ సబ్ డివిజన్‌లో ఉన్న సబ్బవరం, పరవాడ మండలాలను అనకాపల్లి అగ్రికల్చర్ సబ్ డివిజన్‌లో చేర్చారు. దీనిలో భాగంగా అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు మంగళవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను రాంపురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్బవరం, పరవాడ మండలాల్లో రబీ సీజన్‌లో పండిస్తున్న పంటల సరళిని, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్ల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సబ్బవరం మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు బైలపూడి భగవాన్ జయరాం, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ నాయకులు బోకం రామునాయుడు, బోను గంగునాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఏఈవో శ్రీను పాల్గొన్నారు.

## నేడు మూడో విడత 'ఆసరా' సంబరాలు

**పరవాడ:** స్థానిక సంతబయలులో బుధవారం ఉదయం 9 గంటలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు చెప్పారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కులు అందజేస్తారని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బి.అప్పలరాజు పాల్గొంటారని తెలిపారు. మండలంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొనాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పరవాడ:** పెదముషిడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వినోద్‌కుమార్ తెలిపారు. పెదముషిడివాడ, కన్నూరు, మంత్రిపాలెం, లంకెలపాలెం, శ్రీరామనగర్ కాలనీ, గంజిపేట, గొన్నవానిపాలెం, ఈ.మర్రిపాలెం గ్రామాలకు మధ్యాహ్నం రెండు గంటల తర్వాత సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

### నేడు 104 వాహనం ప్రారంభం

**సబ్బవరం:** సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతనంగా 104 వాహనం వచ్చినట్లు పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

### రోడ్లు బాగుచేయరూ..

**అనకాపల్లిటౌన్ :** పట్టణం నుంచి పలు ప్రాంతాలకెళ్లే రహదారులు గోతులుపడి, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురిస్తే ఏది గొయ్యో.. ఏదీ రోడ్డో తెలియక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేపట్టాలని కోరారు.


సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనకాపల్లి :

9010973030, 9010546644

Office mail : sakshiadvtvsp@gmail.com